
# కితకితలు

సుంకర వి. హనుమంతరావు

హఠాత్తుగా ప్రత్యక్షమైన ఆ ఆడశాల్తీని చూస్తూనే 'ఐరన్ లెగ్' ఆడవేషంలో వచ్చాడేంటబ్బా? అనుకూంటూ ఫ్రీజైపోయిన కల్పనారాయిలా కళ్ళూ, నోరూ పూర్తిగా తెరిచేసి... కట్రాయిలా బిగుసుకుపోయింది. వాసం బొంగులు వరహాల్రావ్ భార్యామణి రాంబాయి ఉరఫ్ రంభ. ఇంకా అలాగే గడ్డకట్టుకునుండిపోతే తన పాదాల కిందున్న ఆ చదరపు గజం నేలా బరువు తట్టుకోలేక ఆ మధ్యెప్పుడో కక్కుర్తి బిల్డర్ కట్టిన ఎల్లారెడ్డి గూడ అపార్ట్‌మెంట్స్‌లా పాతాళానికి పయనం కట్టేస్తుందేమోనన్న వంకతో చటుక్కున 'లైట్లెలిగించుకుని' డాలూ! నువ్వా?నువ్వేనా? అంటూ పరుగెత్తబోయి అమ్మో! అసాధ్యమైన ఫీట్ 'మనకెందుకులే' అనేసుకొని తాపీగా కదిలి ఆప్యాయంగా వాటేసుకోబోయి ఆపని కూడా 'అమ్మో'గా తోచడంతో తన 'భారీకాయాన్ని' 'డాలూ' అనబడే ఆండాలు భారీ శరీరానికి అలా..అలా... తాకించింది. పొరపాటున ఇద్దరూ గనక కిందపడితే



**వచ్చే భూకంపాన్ని ముందే ఊహించేసుకుని బొసే రంభా!నేనే-నీ డాలూనే... అండాలునే-అయినా-నువ్వుకూడా ఇలా నాలా? అంటూనే తన శరీరాన్ని రంభకాయానికంటించింది.**

'తల్లో! నా టెంపో కిరాయిస్తే-నేబోతా'

'అమ్మా! మాతా!కబళంతల్లీ' స్టైల్లో వినిపించిన ట్రాలీవాలా ఆర్తనాదాన్ని వింటూనే 'ఔను స్మీ' అనుకుంటూ జాకెట్‌లో కూరుకుపోయిన జానెడు పొడుగు మనీ పర్సును బలవంతానా పీకి 'ఇదిగో' అంటూ అయిదొందల నోటును అతని చేతిలో కుక్కేసింది 'అండాలు'

తల్లో! ట్రాలీట్యూబ్‌లైట్లు పేలిపోయి-డిస్కులు కూడా 'డిస్కో' లెవల్లో వంగి పోయాయి. మరో అయిదొందలు...'

అతని మాటలు పూర్తి కాకుండానే 'హూ' అంటూ భారీగా నిట్టూర్చి...బలంగా ఊపిరి వదిలిపెట్టింది రంభ.

అంతే సుడిగాలికి కొట్టుకుపోయిన పూచిక పుల్లలా...

రోడ్ మీదకు విసిరేయిబడ్డాడు టెంపో ట్రాలీ డ్రైవర్.

మీకిప్పటికే ఆ సీనేంటో అర్థమై పోయుం డాలి....

ఇక పోతే పాత్రల పరిచయం...

కేవలం రెండక్షరాల్ని పేరు పక్కన చెక్కించుకోవాలనే తపనతో వీర గజినీ లెవల్లో గ్రాడ్యుయేట్లయిన అపూర్వ మిత్రురాళ్ల శాల్తీలవి. అప్పుడు అండాలు అనబడే అమ్మడు సన్నగా గోంగూరు కాడలా వుండేదని... రంభని పిలిపించుకునే రాంబాయి నవనవలాడే తోటకూర కాడలా వుండేదని చెప్తే నమ్మడానికి మా చెవుల్లో కాలీఫ్లవర్లేమన్నా వున్నాయేంటి? అని మాత్రం అనేయకండి.

ఊరిపోయిన ప్రతి చెట్టూ చిన్నపాటి సీడ్ లోంచే పుడుతుందని.... ఒకే ఒక్క మనిషి ఎన్నిసార్లైనా ఆమరణ నిరాహారదీక్షలు చేయ్యొచ్చని నమ్మక తప్పని నిజాల్లా-నేటి భారీ శాల్తీలక్కూడా పూర్వాశ్రమంలో పల్చన శరీరాలే వుండేవన్న ట్రూత్‌ను ''తూ...నా బొడ్డు'' అనేయకండి. అలాంటి నాజూకు ఆకృతులున్న ఆ గుమ్మలిద్దరూ అప్పుడే పెళ్లిళ్లు చేసేసుకొని ఒకరు భాగ్యనగరంలోనూ...మరొకరు కడపలోనూ సెటిలైపోయారు.

చేతుల్నిండా చేసే పనుల్లేక, కనిపించినదాన్నల్లా 'కతికేసే' 'కుతిని' అరికట్టుకోలేక కదిలేకాలాన్ని కదలకుండా ఛానెళ్లకు అంకితం చేసేసి ఊరి ఊరి ఆగిపోయిన కందదుంపల్లా ఫిక్సైపోయారు .హ్యాపీ హ్యాపీ ఫస్ట్ ఇయర్...స్లీపీ స్లీపీ నెక్ట్స్ ఇయర్... హెవీ...హెవీ థర్డ్ ఇయర్ అని పాడుకుంటూ ఎలాగైనా కలుసుకోవాలని విశ్వప్రయత్నాలు చేసిన ఆ జంటను ఇటు స్టేట్, అటు సెంట్రల్ మూకుమ్మడిగా మోసం చేసేసాయి!

చీరలు ధరించిన సుమో వీరుల్లా వున్న వీరిని కనీసం ప్రయాణ ప్రాంగణాలలోకి కూడా అడుగు పెట్టనీయకుండా క్యాట్ కార్డ్ పట్టుకొని మరీ మ్యావ్ మ్యావ్ అంటూ మీద పడి రక్కేసి అసలే వీగ్గా వీక్ టైర్లతో నడుస్తున్న బస్సుల్ని రక్షించుకున్నారు. స్టేట్ ఓన్డ్ ఆర్టీసి సిబ్బంది. ఇలా స్టేట్ గవర్నమెంటూ-వీళ్ల పర్సనాలిటీలు పట్టడానికి అనువుగా లేని కంపార్ట్‌మెంట్స్ తయారు చేసి అలా సెంట్రల్ గవర్నమెంటూ దగా చేసేసాయి!

దయచేసి మాకోసం ఓ ప్రత్యేక కంపార్ట్ మెంట్‌ను తలుపులు లేకుండా తయారు చేసి వేస్తే 'త్యాగమయికీ...భాగ్యమయ్యకు' చప్రాసీ పనులైనా చేసి 'రుణం' తీర్చుకుంటామంటూ అర్జీలు పెట్టుకున్నా 'జంతర్‌మంతర్' అంటూ 'జాన్తానై' అనేసారు.

కానైతే 'పడితే మాకేంటి-పరుగెడితే మాకేంటి' అనే స్లోగన్‌తో రన్ చేస్తున్న గూడ్స్ సెక్షన్ అధికారులు మాత్రం చినిగిపోయిన పచ్చజెండా ఊపేశారు.

'సినిమా టిగ్గా' సరిగ్గా అప్పుడే కడప తల్లిలో చిన్న కదలిక!

తెలిసిన వాళ్లెవరైనా కలిసినప్పుడు 'ఏంటి? మీరు కడపలో వుంటున్నారా? అని అడుగుతుంటే ఏంటి? మీరుకడుపుతో వుంటున్నారా' అంటూ వినిపించడం మొదలైపోయింది.

అంతేకాకుండా అనేకానేక పత్రికల్లో మార్మోగిపోతున్న 'పాట్టల్స్ సిస్టర్స్' యాడొకటి ఆమె కంట పడిపోయింది.


దీంతో పాటు ఆ రాత్రి ట్రిబుల్‌కాట్ మీద ఒక పక్కగా ఆరుంగుళాల జాగాలో స్కేలు బద్దలా శయనించున్న భర్తగారైనటువంటి పుటుక్కుల పుల్లారావు కాలి మీద పొరపాటున దొర్లడంతో అది కాస్తా పుల్లలా పుటుక్కుమనేసింది.

అపర సావిత్రిలా అతగాడిని 'ఎముకల బొక్కారావు' దవాఖాన్ల జాయిన్ చేసేసి పొట్టల్ సిస్టర్స్‌తో బాటు తన చిన్ననాటి నేస్తం అండాల్ని కూడా తనివి తీరా చూసుకోవాలనే ధ్యేయంతో పది పయ్యల లారీనెక్కేసి స్టేషన్‌లో డంపైపోయి-గట్టి చక్రాలుండే గూడ్స్ ట్రైన్‌లో హైదరాబాద్ చేరుకని టెంపో ట్రాలీలో అడంగు చేరుకుంది.

అలా వచ్చి తన ఫ్రెండును తన స్థాయిలో చూసుకొని 'ఆహా! నాకూ ఓ తోడు దొరికిందను కుంటూ...కీళ్ల నొప్పుల తల్లికి...లేవడానికో గోడ దొరికితే....పొందేంత... 'ఆనందాన్ని' పొందింది....

ఇక 'రంభా'హో విషయానికొస్తే...

ఈమె ప్రాబ్లం కూడా దాదాపు డిటోనే! ఏసిని మాకెళ్లినా...సోఫాసీట్ తప్ప సింగిల్ సీట్ తనకు సూటు కాకపోవడంతో - ఏ ఫ్రెండ్ ఇంటికెళ్లినా... గేట్ దగ్గరే నిలబెట్టి మాట్లాడి తమ 'ఫర్నిచర్'ను రక్షించుకోవడమనే ప్రక్రియల్ని స్వయంగా గ్రహించేసి-ప్రియనేస్తం తలపెట్టబోయే 'వది లించుకునే' కార్యక్రమంలో చేరిపోవాలని 'డిటో' ఆనందాన్ని పొందేసింది.



అపూర్వ పుస్తక ... వేలగా వెంకటప్పయ్య ...
Cell 9392055065


***

రామాయణంలో పిడకల వేట!

ఆ రాత్రి తమ బెడ్రూంలో అల్పాయుష్షుతో అలరారుతున్న కాట్ మీద గనుక తన నెచ్చెలితో బాటు శయనిస్తే-భూకంపం తన బెడ్‌రూంలోనే సంభవించడం తథ్యమనే విషయాన్ని గుర్తించినట్లు-హాల్లో దిళ్లేసుకొని 'భూదేవి'ని భయపెట్టే కార్యక్రమాన్ని ' అండాలు'ను బ్రతిమలాడి అమలు చేసింది రంభ

గత రెండు సంవత్సరాలుగా పక్కలో రోలర్ని పెట్టుకొని వీర జాగారం చేస్తున్న వాసంబొంగుల వరహాల్రావు-హబ్బీ ఆఫ్ 'రంబాజీ' వరదలైపొంగుతున్న ఆనందానికి అడ్డుకట్ట వేయలేక బెడ్‌రూం తలుపుల్ని గట్టిగా బిగించేసుని మంచానికి అడ్డంగా పడిపోయి ఇదే అంతిమరాత్రన్న లెవల్లో హైపిచ్‌లో గురకపెట్టేసాడు.

***




ఉదయం పది గంటలకే....గునగునా నడుచుకుంటూ ఆండాల్స్ అండ్ రంభలు సువాసనలు వెదజల్లుతున్న 'ఓ నాలా' పక్కనున్న 'పొట్టల్ సిస్టర్స్' దవాఖానా ముందు చేరిపోయారు. పత్రికలలో మల్టీకలర్స్‌లో కనిపించే 'బిల్డింగ్' ఇదేనా? కాదా? అనే అనుమానంతో మరోసారి నాలా మీదు 'నాటున్న' బోర్డ్‌ను చదివే కార్యక్రమానికి శ్రీకారంచుట్టారు.

'పొట్టల్ అండ్ పొట్టల్ దవాఖానా-కబ్జానాలా-కబ్జాగుడ్డ, మా బెంచీలు-కాషాయిగుడ్డ-యూసఫ్‌గుడ్డ-చప్పిలిగుడ్డ-బీకే గుడ్డ-హైదర్ గుడ్డ-పట్టిగుడ్డ- హబ్సీగుడ్డ- ఎర్రగుడ్డ-కుక్కలు పిల్లి-చిక్కడిపిల్లి-చెత్రినాకు-తారునాకు' చదువుతూనే అర్థం కాక కడపతల్లి కళ్లు తేలేసింది.

ఇదేం ఊరే బాబూ! ఈ గుడ్డలూ, కుక్కలూ. పిల్లుల్తోబాటు, నాకడాలూ గట్రా ఏంటే? ఇదసలు తెలుగేనా?

అయ్యో! అపార్థం చేసుకోకే బాబూ! భాగ్యనగరం తెలుగంతే...

అవేంటంటే కుషాయి గూడ. యూసఫ్ గూడ, సఫిల్ గూడ, బీకే గూడా, హైదర్‌గూడా, పాటిగడ్డ, హబ్సీగూడ, ఎర్రగడ్డ, కుక్కట్‌పల్లి, చిక్కడపల్లి ఛెత్రినాక, తార్నాకలని ఏరియాల పేర్లు. బెంచీలంటే బ్రాంచీలని. అధికారా బాసాసంగం అధినేతల్ని మనసులోనే దుమ్మెత్తిపోస్తూ తలదించుకొని సమాధానం చెప్పింది రంభ.

ఇద్దరూ చాలా జాగ్రత్తగా సెల్లార్లోకి అడుగుపెట్టారు. పందుల పాక్కి ఎక్కువ బందెల దొడ్డికి తక్కువ అనే లెవల్లో వుంది రిసెప్షన్ రూం. ఓ నవాబు టైపు సింహాసనంలాంటి ఐరన్ కుర్చీలో దర్శనమిచ్చిన బర్రెకి కొమ్ములుచెక్కేసి అలంకరించినట్లున్న శాల్తీని చూసి 'గతుక్కుమని' ఎక్కడో చూసినట్లుందే ఈ బర్రె ముఖాన్ని అనుకుంటూ బుర్రలుగోకేసుకోబోతుంటే...

'రాంఢ్రి, రాంఢ్రి నా పేరు బలం...పొట్టల్ సిస్టర్స్‌లో నెంబర్‌వన్ని' అంటూ 'షేక్ హ్యాండ్' కోసం తన కంబద హస్తాన్ని ముందుకు సాచింది.

'సన్నగా, స్మార్ట్‌గా, పేపర్ యాడ్‌లో అందంగా కనిపించిన మూడు ముఖాల్లో ఏ ముఖం కూడా ఈ బర్రె ముఖానికి అస్సలు సూట్ కాకపోవడంతో... సున్నం ముఖాలు పెట్టేసారు' రంభ అండ్ ఆండాల్స్

సున్నం ముఖంల్లో ఫీలింగ్స్‌కి కూడా సూక్ష్మంగా గ్రహించేసిన 'బలం' తన గారపట్టిన పళ్లను గంభీరంగా చూపిస్తూ 'యాడ్ ఫొటోవ్‌ల పోరికి నాకూ కనెక్షన్ గిట్టలేదని పరేషాన్ గాకున్రి...గా ఫోటో నాదే! గానైతే గా పొటొదించి బీస్ సాలైపాయే! మేం పేపర్ల 'ఛపాయించెడి' పొట్టలన్నీ గిసుమంటివే. ఇప్పుడైతే బర్రెలెక్క బలిసిన్రు మీరు. ఫ్లాష్ బేక్‌ల ఎట్లుండెటోళ్లు? గా పొట్టలన్నీ మీలాంటి 'బకరాల్ని' బోల్తా కొట్టించేందుకే 'ఉల్టా-పుల్టా' చేసి ఛపాయిస్తం'

అంటూ నవ్వుతూ ఆపసోపాలు పడుతున్న బలాన్నిచూస్తే వికారమొచ్చి ముఖాలుతిప్పుకుంటూ ఆ రూంలోనే ఫేస్‌మాస్క్‌లతో ఉబ్బిపోయిన శవాల్లా బెంచీల మీద పడున్న శాల్తీలను చూస్తూనే కడుపులో 'కడప బాంబ్' బద్దలైపోయినట్లు షాక్ తినేశారు.

'ఫికర్ గాకున్రి...గవీ మీ అసుంటి కేసులే... మా తానకు రాకముందేనుగులెక్కనుండెటోళ్లు... ఇప్పుడు చూడున్రి బర్రెలెక్కకొడుతుండ్రు' అంటూ 'మైక్‌టైసన్' ఆడవేషంలో వచ్చినట్లున్న రెండో సిస్టర్ ధనం ధైర్యం చెప్తుంటే మూడో సిస్టర్ ' ఉసిరిక పెన్సిల్‌కు చీరచుట్టినట్టున్న పెర్సనాలిటీతో ' ఒక పక్కకు వంగిపోయి వగర్చుకుంటూ' వచ్చేసింది.

'పాపం! మహా బ్రతికితే! మరో నాల్రోజులు' ఫ్రెండ్స్ మనసులోని మాటను గ్రహించేసినట్లు వీర డైటింగులు గట్రా చేసి పెయ్యంతా గుంజుకు పోడంతో యిట్లైపాయె. అన్నంతినే సోపతి లేక జ్యూసులూ గిట్ట తాగి గిట్లైపాయె' నెంబర్ వన్ మాటల్లో ఉసిరికకు ఉక్రోషం వచ్చేసింది.

తన పాచిపోయిన సినిమాను రిలీజ్ కాకుండా కొందరు కుట్రచేస్తున్నారని విరుచుకుపడిన 'తెలంగాణా తల్లి' లెవల్లో మీరు మాత్రం డైటింగ్ దెబ్బకు థైరాయిడ్ డిఫెక్టొచ్చి తారు డ్రమ్ముల్లా ఊరిపోలా? పుల్లల్లా చేతులూపుకుంటూ రిటార్టిచ్చింది ఉసిరిక.

ఈ సీనిలాసాగుతుండగా....

చేతిలో ఓ దుడ్డు కర్రతో అపరిచితుడి లెవెల్లో ప్రవేశించాడోవ్యక్తి. మాటా మంతికి తావియ్యకుండా చేతిలో వున్న కర్రతో సిస్టర్ వన్ అండ్ టూలను వీర ఉతుకుడు ఉతికేసాడు. ఉసిరిక మాత్రం కిటికీ చువ్వల మధ్య నుండి నాలాలోకి దూకేస్తే ...

బెంచీనంటిపెట్టుకున్న తల్లులు నైటీల్లో వున్న ఆధునిక దెయ్యాల్లా వీధుల్లోకి పరిగెత్తారు అందరినీ భయపెడుతూ...

తన రెండువేల ఎకరాల్లో ఔటర్ రింగ్‌రోడ్‌పేరుతో రెండొందల ఎకరాల్ని లాగేసుకున్న ప్రభుత్వాన్ని దుమ్మెత్తిపోసిన గౌడు గారిలా రూం మధ్యలో నిలబడి బిపితో కందిపోయిన ముఖంలోని కంపనాలు కనిపిస్తుండగా ఆగంతకుడు వన్ అండ్ టూల వంక క్రూరంగా చూస్తూ.

''ఏయ్!పొట్టల్స్!''

మీరు ''బరువులు తగ్గిస్తాం..పొట్టలు తగ్గిస్తాం అంటూ ఇచ్చిన పిచ్చి ప్రకటనలు నమ్మి మందంగా వున్నా అందంగా వుండే నా భార్య మీ దవాఖాన్ల వేలకు వేలు గుమ్మరించింది.''డైటింగ్ అనే పదానికి స్పెల్లింగ్ కూడా తెలియని మీరు డైటింగ్ పేరుతో పస్తులుంచి పిచ్చి పిచ్చి సలహాలిచ్చారు.

''ఆహారం లేక అల్సర్లొచ్చాయి. కంటి చూపు తగ్గిపోయి, జుట్టుంతా ఊడిపోయి, గట్టు మైసమ్మ జాతరలో బోనాలెత్తే 'బోడిగుండు బాలమ్మ'లా తయారైంది నా పెళ్లాం!''

''బలిసిపోయిన బర్రెల్లా వున్నారు. ఎక్కడైనా కాయకష్టం చేసుకుని ముందాకాయాన్ని తగ్గించుకోండి''!

''మళ్లీ ఎక్కడైనా మీ బోర్డు కానీ, మీరు గానీ కనిపించారో శాల్తీలుండవు. ఖబడ్దార్'' అని హెచ్చరించి క్షణంలో మాయమైపోయాడు. ఫ్రెండ్స్ ఇద్దరూ హమ్మయ్య అనుకుంటూ ఊపిరిపీల్చుకుంటూంటే అపరిచితుడు మళ్లీ ప్రత్యక్షమై..

పశువుల దాణా యాడ్‌కు సూటయ్యే ఈ ముఖాలిచ్చిన యాడ్లు చూసి మీలాంటి ఎడ్యుకేటెడ్ కూడా ఎట్రాక్ట్‌వడం సిగ్గుచేటు అంటూ కొట్టినంత పనిచేసి వెళ్లిపోతే కడప తల్లి భయంతో విరుచుకుపడిపోయింది.

***

హఠాత్తుగా అలా ఢమాలైపోయిన 'నెచ్చెలిని' అంబా అండ్ మేమే దావాఖాన్ల జాయిన్ చేయబోతే! అమ్మో! అంత కెపాసిటీ వున్న కాట్స్ మా దగ్గర లేవు తల్లీ! అంటూ వారు చేతులెత్తేస్తే....నీలోఫర్లో వున్నాయా? గాంధీలో వున్నాయా? అయినా అందరినీ భరించే అవనిమాతుండగా పనికిరాని కాట్సెందుకు? ఎక్కడో దిగడం దండగ అంటూ కాళ్లావేళ్లా పడి 'ఫ్లోర్' మీదే పక్కేయించేసింది రంభ. ఆరోజు నుండి ప్రజాతీర్పుకు ఢమాలైపోయిన 'పురుచ్చితలైవికి' శశరేఖ చేసినట్లు వీర సేవలు చేసింది ఆండాలుకురాంబాయి. ఆండాలు ఇచ్చిన రొచ్చుకంపు పాలు, ఫినాయిల్ పుడ్డు వికటించడంతో ఆ నెలరోజులూ బోండాం వాటర్‌తో కీరాదోసకాయలతో ప్రాణాలు నిలబెట్టుకొని అనూహ్యంగా స్లిమ్మైపోతే... ఆండాలు సేవల కోసం ఇంటికి ఆస్పత్రికి కాలి నడకన ప్రదిక్షణాలు చేసిన రంభ కూడా 'రంభోహో' లెవల్లో సన్నపడిపోయింది.

***

పుటుక్కుల పుల్లారావు, వాసంబొంగుల వరహాల్రావులు తమ ముందున్న అపరిచితుడిని ఆరాధనాపూర్వకంగా చూస్తూ ''మీ దయవల్లే మా భార్యల్ని, చెరో యాభైవేల రూపాయల్ని రక్షించుకున్నాం.'' అంటూ ముక్త కంఠంతో ఛీర్స్ కొట్టి మరీ థాంక్స్ చెప్పారు.

''నాదేముంది? నా భార్యలా మీ భార్యలూ కాకూడదనే తపనతో బాటు ఆ పొట్టల్స్ బర్రెల్ని ఎలాగైనా బాదికసి తీర్చుకోవాలన్న కోరికతో చేసిన చిన్న సాయమది'' అంటూ కసిగా...కబాబ్ కొరికేసాడు... అపరిచితుడు... ఊరఫ్...పొట్టల్ బారిన పడిన ఓ భార్యమణి భర్త.

విరిగిన కాలితో బొక్కల దవాఖన్లలో చేరిన పుల్లారావుకు...అపరిచితుడు కాలికి ఫ్రాక్చరైన భార్యతో పరిచయం అయ్యాడనీ, మాటల మధ్యలో పుల్లారావు తన భార్య గోడు వెళ్లబోసుకున్నాడని...వరహాల్రావుతో మాట్లాడి...' ఉతుకుడు' కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా పూర్తిచేసారనే నగ్న సత్యం...డాల్డాతో గులాబ్‌జామ్‌ల తయారీలో నిమగ్నమైన ఫ్రెండ్సిద్దరికీ తెలిసే అవకాశమే లేదు.

దయచేసి మీరు మాత్రం చెప్పకండే? ప్రామిస్!!!

★



## యోగా టీచర్‌కు యోగం

ఆయన పేరు భరత్. బెంగుళూరులో పెద్ద యోగా టీచర్. ఇప్పుడు స్వీట్ ట్వంటీగా పిలవబడే అనుష్కకు భరత్ యోగా టీచర్. ఈ పరిచయాలు ఓ అడుగు ముందుకేయడంతో అనుష్క భరత్ ద్వారా తెలుగు సినిమాల్లోకొచ్చింది. కంప్యూటర్ అప్లికేషన్స్‌లో గ్రాడ్యుయేషన్ చేస్తూనే యోగాలోకి ఎంటరయింది కానీ, అనంతరం సినిమాల్లోకి పరిచయమై సూపర్, మహానంది లాంటి సినిమాల్లో నటించింది. విక్రమార్కుడు సినిమాతో బాగా లైమ్‌లైట్‌లోకొచ్చింది. స్టాలిన్ సినిమాలో చేసిన ఐటెమ్‌సాంగ్ బాగా కలిసొచ్చింది. దీంతో ఆమెను అందరూ 'యోగా టీచర్‌కు యోగం పట్టింది' అని అనుకుంటున్నారు. ఇంతకీ అనుష్క అసలు పేరు తెలుసా?... స్వీటీ షెట్టీ!